


# ఫారిన్ వెళ్ళాల(న)ండీ

## - వసుంధర



***మనం ఎంత ఆధునికమైనా, చరిత్రకున్న విలువ మరువలేనిది. అలానే ఈ రోజుల్లో ఎప్పుడు కావాలంటే అప్పుడు ఎక్కడికైనా వెళ్ళగలిగే సౌకర్యాలు (డబ్బులుంటే చాలు) ఉన్నాయి కానీ కొన్ని దశాబ్దాల క్రిందట (1970 దశకం ప్రారంభంలో) ఇలాంటి ప్రయాణాల వెనుకనున్న సాధకబాధకాలు తెలుసుకోవడం ఇప్పటికీ ఆసక్తికరంగా ఉంటుంది. -సం.***

*(గత సంచిక తరువాయి)*

1974-75 వాతావరణంలో అప్పటి పశ్చిమజర్మనీ దేశం ఈ రచనలోని సన్నివేశాలకు వేదిక. ఆ సన్నివేశాలను వివరించినది – అప్పటి వాతావరణంలో సంప్రదాయబద్ధంగా పెరిగి, ఆధునికతని అవగాహన చేసుకుంటున్న ఓ మధ్యతరగతి భారతీయుడు. వృత్తిరీత్యా సైంటిస్టు.

అప్పటికి ఇండియాలో టివిలు కొన్ని మహానగరాలకే పరిమితం. టెలిఫోన్లు వ్యాపారస్థులకీ, భాగ్యవంతులకీ, ఉన్నతోద్యోగులకే అందుబాటు. కంప్యూటర్లది పాశ్చాత్యదేశాల్లోనూ పెద్ద గదిని కేటాయించాల్సినంత పరిమాణం. మొబైల్సు, ఇంటర్నెట్ వగైరాలు వాడుకలోకొస్తాయన్న ఊహ కూడా లేదు.

ఇండియాలో ఇప్పుడు గ్రామాలకున్న సదుపాయాలు, అప్పుడు మహానగరాలకే లేవు. ఆ నేపథ్యాన్ని స్మరించి – రచయితతోపాటు పాఠకులూ 1974లో పయనించి – చదవడం మొదలెడితే – ఈ రచనలోని చాలా విశేషాలు మరింత రసానుభూతినిస్తాయి. ఐతే 2016-17లోనూ – 'మనం ఎక్కణ్ణించి ఎక్కడికొచ్చాం? ఎక్కడికి పోతున్నాం?' అనే భావనను కలిగించి ఆలోచింపజెయ్యగలిగితే, ఈ రచన సార్థకమౌతుంది.

అంశాల పరంగా ఇది రెండు భాగాల రచన. మొదటిది ల్యానబర్గులో 'పీజీ టు కేజీ' గత మాసంలో ముగిసింది. ఇప్పుడు రెండవది 'బెర్లిన్ ద్వీపే డాయిచ్ ఖండే'లో తొలివిడతగా 'ఫన్ నేనొక్కడినే'. ఇందులో అంశాల్ని జరిగిన వరుస క్రమంలో కాక – పాఠకులకు అనువుగా ఉండేందుకు ఉపశీర్షికల్లో వివరించడం జరిగింది.

రసానుభూతితోపాటు, ప్రయోజనాత్మకమూ కావాలన్న మా తపన అక్షరరూపం దాల్చడానికి స్ఫూర్తినిచ్చిన కౌముదికి హృదయపూర్వకంగా ధన్యవాదాలు తెలుపుకుంటూ, రచనలోకి అడుగెడుతున్నాం.

## రెండవ భాగం: బెర్లిన్ ద్వీపే డొయిచ్ ఖండే

## *చివరి విడత: మలి సందడి (40)*

‘**మడిసన్న తర్వాత** కూసింత కలాపోసన ఉండాల’ అని రావు గోపాలరావు చేత అనిపించారు ముళ్లపూడి వారు ‘ముత్యాలముగ్గు’ చిత్రంలో. సినిమాకి అది హాస్యమైనా జీవితానికి అదో గొప్ప సందేశం.

కళాపోషణ అభిరుచికి సంబంధించిన విషయం.

అభిరుచులు ప్రతి మనిషికీ ఉంటాయి. కొందరికా విషయం తెలియదు. కొందరికి తెలిసినా జీవనపోరాటంలో వాటిని పక్కకి నెడతారు.

జీవనపోరాటంలో అభిరుచులకే ప్రాధాన్యమిచ్చేవారు కొందరుంటారు. అందువల్ల లాభపడ్డవారికంటే నష్టపోయినవారే ఎక్కువ కావడం వల్ల– చాలామంది అభిరుచుల్ని పక్కకి పెట్టాలనుకుంటారు.

అలాంటివారికోసమే ‘మడిసన్న తర్వాత కూసింత కలాపోసన ఉండాల’ అన్న సందేశం

నా అభిరుచి సినిమాలు. అందులో భాగంగా సినిమా పాటలు వింటాను. వాటిలోనూ హుషారైనవీ, లయ ప్రాధాన్యమైనవాటినే ఎక్కువ ఇష్టపడతాను.

సినిమా పాటలపై నాకున్న ప్రీతి కళాపోషణ స్థాయి అభిరుచి కాదని నాకు తెలుసు. ఎందుకంటే బయట జరిగే సంగీత కచేరీలే కాదు, రేడియోలో వచ్చే లలితగీతాలనీ ఇంతవరకూ నేనంతగా పట్టించుకోలేదు.

నా అభిరుచి గురించి నాకే సరిగ్గా తెలియదని, రావుగారి కుటుంబంతో దగ్గరి పరిచయమయ్యాకనే అనిపించింది.

రావుగారి ముచ్చట్లలోకి వెళ్లేముందు– ఆ ముచ్చట్లకు ప్రాధాన్యత సంతరించిన నా నేపథ్యాన్నిక్కడ క్లుప్తంగా ప్రస్తావించాలి.

హైస్కూల్లో థర్డుఫారంనుంచి కాలేజిలో బీయస్సీ పూర్తయ్యేదాకా నేను. మా అన్నయ్య మా తాతగారింట్లో ఉండి చదువుకున్నాం.

తాతగారిది ఉమ్మడి కుటుంబం. ఇద్దరు బాబయ్యల కుటుంబాలూ అక్కడే ఉండేవి. ఇద్దరత్తయ్యలు వస్తూ పోతూండేవారు.

ఇంకా బంధుజనుల రాకతో ఇల్లెప్పుడూ జనంతో కలకల్లాడూతూ సందడిగా ఉండేది.

అందొచ్చిన వయసు కాబట్టి నాకు, మా అన్నయ్యకి చేతినిండా పని ఉండేది. మాకంటే చిన్నవారైనా కజిన్సుతో బాగా కాలక్షేపం అయ్యేది.

బ్రతుకుతెరువుకి బాట పడుతున్న ఆ రోజులు ఎన్నో అనుభవాల్నిచ్చాయి. బడితోపాటు ఇంటాబయటా పాఠాలు నేర్పాయి. నేడు ఎన్ని చిక్కులున్నా, ఎంత విషాదమున్నా– రేపనేదానిపైన ఆశ, మక్కువ, ఉత్సాహం కలిగించేవి. విసుగన్నది స్ఫురించకుండా– ప్రతి రోజూ ఎంతో ఆసక్తికరంగానూ, సరదాగా గడిచిపోయేది.

మా కాలేజి రాజమండ్రిలో. తాతగారు ధవళేశ్వరంలో ఉండేవారు. నాన్నగారు పేరవరంలో ఉండేవారు.

అమ్మకు పిల్లలెక్కువ. పెద్దవాడు అన్నయ్య. నేను రెండోవాణ్ణి. అన్నయ్యకంటే ఏడాదే చిన్న.

మిగతావాళ్లు నాకంటే బాగా చిన్నవాళ్లు. అమ్మకి అవసరమైన సాయం చెయ్యగల వయసు కాదు వాళ్లది.

అందుకని సెలవులొచ్చినా, అమ్మకి అనారోగ్యమో, మరే అవసరమో కలిగినా నాకు కబురొచ్చేది.

ఆ కబురే నాకు శాసనం. అది బడి ఐనా, కాలేజి ఐనా ఎగేసి పేరవరం వెళ్లాల్సొచ్చేది.

పేరవరంలో పంచాయతీ బోర్డు గుమస్తా మా ఇంట్లోనే అద్దెకుండేవాడు. తరచుగా మా ఊరొచ్చే నన్ను చూసి, "వానాకాలం చదువని వినడమే కానీ, నిన్ను చూసేక అదేమిటో నాకు తెలిసింది" అనేవాడాయన.

అందులో వెటకారం ఏమాత్రం లేదు. ఆత్మీయమైన హెచ్చరిక ఉండేది. ఆపైన అతడికి నామీద ఎంత కన్సర్న్ అంటే, అదే మాట మా నాన్నగారి వద్ద కూడా అన్నాడు.

దానికి మా నాన్నగారు, "మావాడికి టీచర్సు అక్కర్లేదు. పుస్తకాలు చాలు. ఫస్టు క్లాసు తెచ్చుకోగలడు" అని బదులిచ్చారు గర్వంగా.

నామీద నమ్మకం కంటే, తన అవసరమే ఆయనచేత ఆ మాట అనిపించిందని తెలుసు.

కానీ ఆయన మాటలోనే ప్రోత్సాహాన్ని వెదుక్కున్నాను.

ఆ మాటతో బాధ్యతని సృష్టించుకున్నాను.

ఆ మాటనే సవాలుగానూ తీసుకున్నాను.

ఎందుకంటే– నేను సత్ఫలితం సాధిస్తే గర్వపడే పెద్దలు– నా ఫెయిల్యూర్సుకు– బాధ్యత వహించడానికిగానీ, సంజాయిషీ వినడానికి గానీ, నిరసన తెలుపకుండా ఉండడానికి గానీ సిద్ధంగా లేరు.

నేటి తరంలో అలాంటి పెద్దలకు నిరసన ఎదురౌతుందేమో! కానీ అప్పట్లో వాళ్లలో ఆత్మీయతానురాగాల్నే ఎక్కువగా గుర్తించేవాళ్లం. వారంటే గౌరవభావాన్ని మనసునిండా నింపుకునేవాళ్లం. వాళ్లని అవగాహనతో అర్థం చేసుకునేవాళ్లం.

అది మా గొప్పతనం కాదు. వాళ్ల వ్యక్తిత్వాలు అలాంటివి.

జీవితంలో పైకి రావడానికి దోహదం చేసినవి వాళ్ల వ్యక్తిత్వాలేనన్నది మాకు స్పష్టమైన నిజం.

ఇంతకీ ఆ రోజుల్లో క్లాసులు మిస్సవ్వడం ఒక్కటే నా సమస్య కాదు. పేరవరం ప్రయాణం కూడా!

పేరవరం కోనసీమకు ముఖద్వారమైన బొబ్బర్లంకకు రెండు మైళ్ల నడకదూరంలో ఉంది.

బొబ్బర్లంక వెళ్లడానికి ధవళేశ్వరంనుంచి నావలో గోదావరీ నది దాటాలి. నీటిమీద ఆ ప్రయాణం గాలివాటాన్ని బట్టి అరగంట నుంచి గంటంపావుదాకా తీసుకుంటుంది. ఐతే నావలు అన్నివేళలా ఉండవు. అందుకు ఎన్నో కారణాలు.

నావ లేనప్పుడు ప్రయాణం మొత్తం కాలినడకమీదే!

ముందుగా గోదావరి నదికి కాటన్ మహాశయుడు ధవళేశ్వరం నుంచి కట్టిన నాలుగు ఆనకట్టల్లో రెండింటిని బాటగా చేసుకుని వెళ్లాలి.

మా ఇంటినుంచి ఆనకట్టకు ఐదారు ఫర్లాంగులు ఉండొచ్చు. అక్కణ్ణించి మొదటి ఆనకట్ట దాటడానికి సుమారు ఒక మైలు.

అప్పుడు పిచికలలంక అనే చిరుద్వీపం వచ్చేది. ఆ లంకలో 2-3 ఫర్లాంగులు నడిస్తే రెండో ఆనకట్ట.

రెండో ఆనకట్టనుంచి 5-6 ఫర్లాంగులు నడిస్తే బొబ్బర్లంక గ్రామం వస్తుంది. అక్కణ్ణించి పేరవరం సరిగ్గా రెండు మైళ్లు.

పేరవరం కాలవగట్టుమీంచి ఒక ఫర్లాంగు దూరంలో ఊళ్లో మా ఇల్లు.

మళ్లీ ధవళేశ్వరం రావాలంటే ఇంత ప్రయాణమూ చెయ్యాల్సిందే!

ఇదీ ప్రయాణం. అప్పుడప్పుడు చేసే ప్రయాణం కాదది. తరచుగానే వెళ్లాల్సొచ్చేది. ఒకోసారి వారం వారం వెళ్లాల్సి ఉండేది.

10-18 ఏళ్ల మధ్య వయసులో, ముఖ్యంగా చదువుకునే విద్యార్థికి అది శ్రమతో కూడినదే. కానీ ఇష్టంగానే ఉండేది.

ఎందుకంటే ఆ ప్రయాణానికి గమ్యంలో అమ్మ ఉంది!

అన్నయ్యకైతే చంటప్పట్నించీ తాతగారింటనే అలవాటై, అమ్మదగ్గర అంత చనువు లేదు.

నా విషయం వేరు.

తాతగారింట అంతా నన్ను ఎంత అభిమానంగా చూసినా, అమ్మ ప్రేమకు సాటి వస్తుందనుకోవడం భ్రమే కదా! అందుకని అమ్మంటే నాకు భ్రమ ఉండడం సహజం.

ఆపైన అక్కడ అమ్మతోపాటు నాకోసం ఎదురుచూసే తోడబుట్టినవాళ్లున్నారు. వాళ్లమీదా నాకు భ్రమ ఉండేది.

ఆ భ్రమ తీరుతుందన్న ఉత్సాహం– నాకు ప్రయాణం శ్రమను తెలియనిచ్చేది కాదు. అక్కడ రోజులు ఆహ్లాదంగా గడిచిపోయ్యేవి. క్లాసులు మిస్ అవుతున్నానని తెలిసినా, అక్కణ్ణించి తిరిగి వెళ్లాలంటే అయిష్టంగానే ఉండేది.

వర్తమానానికి వస్తే– బెర్లిన్లో గ్యోతే స్ట్రాసేలో మా ఇల్లు మాకు ధవళేశ్వరం. క్నెసెబెకే స్ట్రాసేలో రావుగారిల్లు పేరవరం.

రావుగారి కుటుంబం మా ఇంటికొస్తే అప్పుడు మా ఇల్లూ పేరవరమైపోయేది.

మాదీ రావుగారిదీ అలాంటి ఆత్మీయతానుబంధం.

అందుకు కారణమైన కొన్ని విశేషాలు ముందు చెప్పి ఉన్నా, మా సమావేశాల ముచ్చట్లు ప్రస్తావిస్తేనే ఆ ప్రత్యేకత తెలుస్తుంది.

భువనేశ్వర్లో అలాంటి అనుబంధాలు కొన్ని ఏర్పడినా, పాశ్చాత్య దేశంలో– అదీ ఇంత తక్కువ వ్యవధిలో అవి ఏర్పడ్డం విశేషమే!

రావుగారి ముచ్చట్లు

రావుగారి అభిరుచి గొప్పది. జీవన సాహచర్యానికి ఆయన సత్యవతిగార్ని ఎన్నుకోవడమే అందుకు నిదర్శనం. అదెట్లనిన....

జర్మనీలో ఇంగ్లీషు వాడకం ఇంచుమించు నిషిద్ధం. మన దేశంలో జర్మన్ భాషకి ఇంచుమించు ప్రాచుర్యం లేదు.

చూడ్డానికి సీదాసాదా తెలుగు ఇల్లాలిలా అగుపించే సత్యవతి, పిల్లలు పుట్టడానికి ముందు బెర్లిన్లో ఉద్యోగం కూడా చేసింది.

భర్త ఆఫీసుకి వెడితే, అటు పిల్లల్ని చూసుకుంటూ ఇల్లు చక్కబెడుతుందామె.

ఇలా 'ఆలయాన వెలసిన ఆ దేవుని రీతి' ఉండే ఇల్లాళ్లు చాలామందే ఉంటారు మనిళ్లలో. కాబట్టి అదో పెద్ద విశేషం కాదు.

ఆ దంపతులు మొదటిసారి మా ఇంటికొచ్చినప్పుడు, సత్యవతిగార్ని ఓ పాట పాడమని అడిగాం.

అప్పటికి మాకామె రావుగారి భార్యగా మాత్రమే పరిచయం.

నాకు పాటలు వినడం ఇష్టం. అవీ సినిమా పాటలు. అవీ రేడియోలోనో, గ్రామఫోనులోనో...

శ్రీమతికీ పాటలంటే ఇష్టమే కానీ సంగీతం నేర్చుకోలేదు.

మా మామగారికి సంప్రదాయ సంగీతం చాలా ఇష్టం. అందుకని ఆయన తన పెద్దకూతురికి, అనగా శ్రీమతి అక్కకి, అనగా నా వదినగారికి సంగీతం నేర్పించాలని అనుకుని ఓ సంగీతం టీచర్ని పెట్టారు.

ఆమెకి సంగీతం అంటే ఆసక్తి లేక, ప్రతి క్లాసుకీ ఏదో వంక పెట్టి తప్పించుకునేది. అలా కొన్నాళ్లు జరిగేక, మా మామగారు మా వదినకే కాదు, మిగతా పిల్లలకి కూడా సంగీతం నేర్పే ప్రయత్నాలు చెయ్యలేదు.

ఐతే మేమిద్దరం కూడా సంగీతం నేర్వకపోవడాన్ని చిన్నతనంగా భావించలేదు.

"ఈ రోజుల్లో సంగీతం ఎవరికొస్తుందీ! చదువులు, ఉద్యోగాలు, సంసారం– వీటితోనే సరిపోతుంది" అనుకునేవాళ్లం.

మా అభిప్రాయం సరైనదే అని ధ్రువపర్చుకోవాలి కదా– అందుకని ఇంటికొచ్చిన అతిథుల్ని పాట పాడమని అడిగేవాళ్లం.

మొహమాటంతోనో, నిజంగానే రాకనో– సాధారణంగా చాలామంది, 'నేనేమిటి, పాడ్డమేమిటి?' అనేవారు.

ఆ జవాబు మాకు తృప్తినిచ్చేది.

కొందరు కొంచెం గునిసి పాట పాడేవారు. సంగీతజ్ఞానం లేకపోయినా మాకా పాటల్లో అపశ్రుతులు స్ఫురించేవి. వాళ్లు వెళ్లేక, పాడ్డం రాకపోయినా, పాడే ధైర్యముందని అనుకునేవాళ్లం.

"మనకలాంటి ధైర్యం లేకపోవడమే మంచిదయింది. అనవసరంగా అభాసు పాలయ్యేవాళ్లం" అని గొప్పగా ఫీలయ్యేవాళ్లం.

కొందరు అడిగిందే తడవుగానూ, మరికొందరు తామే అడిగీ– భయంకరంగా పాడిన సందర్భాలూ ఉన్నాయి.

వాళ్లు వెళ్లేక వాళ్లని తలచుకుని మనసారా నవ్వుకునేవాళ్లం.

బెర్లిన్ వచ్చేక మా ఆలోచన మారింది.

కొత్తగా టేపు రికార్డింగుకి అలవాటు పడుతున్నామేమో, జ్ఞాపకాలకోసం పరిచయస్థుల గొంతుల్ని రికార్డు చెయ్యడం హాబీ అయింది.

కొందరు మాట్లాడేవారు. కొందరు పాటలు పాడేవారు.

ఆ టేపులు మళ్లీ ప్లే చేస్తున్నప్పుడు– ఆ గొంతులు మధురస్మృతులను పలికేవి.

దాంతో ఎదుటివారి పాటలేమిటి, మాటల్ని కూడా మనస్ఫూర్తిగా ఎంజాయ్ చేస్తున్నాం.

అది కళాపోషణ అని మేమెప్పుడూ భ్రమపడలేదు. కానీ ఆహ్లాదానికే తప్ప అపహాస్యానికి తావు లేని గొప్ప సంస్కృతిని ఆ టేపులు మాకు అలవర్చాయి.

అదే ఆసక్తితో ఇప్పుడు సత్యవతిగార్ని పాట పాడమని అడిగితే, ఆమె మొహమాటంగా, "ఇప్పుడు పాట ఎందుకూ?" అంది. నేను వెంటనే మా హాబీ గురించి చెప్పాను.

"మనం మళ్లీ మళ్లీ కలుస్తాం కదా! మరోసారి చూదాంలెండి" అందామె.

"మన కుటుంబాల ప్రతి సమావేశమూ ఓ తీపి జ్ఞాపకం కావాలి. మీరు కాదనకూడదు" అంటూ లేచాను.

ఎందుకు లేచానా అని ఆ దంపతులు మావంక కుతూహలంగా చూస్తున్నారు.

నేను గ్రుండిగ్ స్టీరియో స్పూల్ టైపు టేపు రికార్డరు తెచ్చి ఆమె ముందు పెట్టాను.

నాణ్యమైన రికార్డింగుకని ప్రత్యేకంగా కొన్న గ్రుండిగ్ మైక్రోఫోను ఆమెకి అందించాను.

సత్యవతి కళ్లు పెద్దవయ్యాయి. "మంచి సిస్టం ఉందే మీ దగ్గర" అందామె.

"రికార్డింగు విషయంలో మా సిన్సియారిటీ నిరూపించుకోవాలికదండీ" అన్నాను.

రావుగారు నవ్వుతూ, "మంచి సిస్టం. 'నీ పాట నా నోట పలకాలి తల్లీ!' అంటోంది. నువ్వు కాదనకూడదు" అన్నారామెతో.

తర్వాత నావైపు తిరిగి, "మంచి ఏర్పాట్లు చేశారు. ఇక మీరు మా ఆవిణ్ణి ఆపలేరు" అన్నాడు.

"మా వారన్నది నిజమే! మీ ఏర్పాట్లు నాకు మంచి స్ఫూర్తినిచ్చాయి" అంటూ గొంతు సవరించుకుందామె.

మా పిల్లలతో సహా అందరం బుద్ధిమంతులైన శ్రోతల్లా మౌనం వహించాం.

వాహినీవారి రంగులరాట్నం చిత్రంలో 'కనరాని దేవుడే కనిపించినాడే' అన్న పాట ఆరంభించిందామె.

ఖంగుమనే తియ్యని గొంతు.

ఆమె ఇలా ఆరంభించగానే– ఆ స్వరం విని మేమంతా సినిమాల్లో చూపించినట్లు ఒక్కసారిగా మంత్రముగ్ధులమైపోయాం.

రంగులరాట్నం సినిమా నాకు చాలా ఇష్టం. అందులో చంద్రమోహన్ మరీ ఇష్టం.

ఆ సినిమా చూసి పదేళ్లౌతోందేమో– పాటల్లో మాత్రం త్యాగరాజు వాణిశ్రీతో కలిసి పాడిన 'నడిరేయి ఏ ఝాములో మాత్రమే గుర్తుంది.

ఈ పాట కూడా నాకు తెలుసు కానీ, నా అభిరుచికి అందలేదు.

ఇప్పుడీ పాట వినగానే ఆ సినిమాలో, ఆ పాట ఇంత బాగుంటుందా అనిపించింది.

పాట ముగిసేక కాసేపు అప్రతిభులమై చప్పట్లు కొట్టడం కూడా మర్చి అలా ఉండిపోయాం.

విశేషమేమంటే ఆమె పాడింది సినిమా పాటే ఐనా ప్రతిష్ఠాత్మక సంగీత కచేరీలో పాడినట్లుంది. అలాగని సినిమాతనానికి ఏ లోటూ రాలేదు.

"ఏమాత్రం హడావుడి లేని సీదా సాదా వరస కూడా ఆర్కెస్ట్రా లేకుండా ఇంత వినసొంపుగా ఉంటుందా?" అన్నాను ఆశ్చర్యంగా. అదీ నా అభిరుచి స్పందన.

"సందర్భం వచ్చింది కాబట్టి చెబుతున్నాను. మా ఆవిడ ప్రొఫెషనల్ సింగర్. ఆలిండియా రేడియోలో గ్రేడెడ్ ఆర్టిస్టు. ఆమె, ఆమె అక్క జంట గాయనీ మణులుగా ప్రాచుర్యం పొందారు" అన్నాడు రావుగారు కించిత్ గర్వంతో.

ఇంత పెద్ద విషయాన్ని సందర్భం వస్తే తప్ప చెప్పకపోవడం వారి వినయానికి నిదర్శనం.

సూర్యనారాయణుడికి మేలుకొలుపు పాడుతూ– భానుతేజానికి 'ములగపువ్వుమీద ముత్యంపు పొడి ఛాయ' అన్నంత చక్కగానూ– ఆ గర్వం ఆయన వినయానికి అతికింది.

"మీరు పాడమని అడుగుతారనుకోలేదు. ప్రిపరేషన్ లేకుండా ఏదో పాడేశాను. బాగుందనడం మీ మర్యాద. కానీ నా తప్పులు నాకు తెలుస్తూనే ఉన్నాయి" అంది సత్యవతి.

పాటలో తప్పులు దొర్లాయని అనుకోను. రికార్డింగయ్యేక పాటెలా వచ్చిందో తెలుసుకోవాలన్న కుతూహలం ఎవరికైనా ఉంటుందిగా. అందుకని పరోక్షంగా అలా సూచిస్తున్నారేమోనని నాకు అనిపించింది.

శ్రీమతికీ అలాగే అనిపించినట్లుంది, "ఒకసారి ప్లే చెయ్యండి. ఆ తప్పులేమిటో ఆవిడే చెబుతారు. తెలుసుకుంటే మన పాప నేర్చుకుందుకు కూడా పనికొస్తుంది" అంది.

అప్పటికే మా పాప, ఆ పాటని హమ్ చేసుకుంటోంది. దానికి నిజంగానే సంగీతం పట్ల అభిరుచి.

నేను ప్లే చేశాను. వింటుంటే ఇందాకటికంటే గొప్పగా అనిపించింది.

"మీ గొంతుతో మా టేపు రికార్డరు ధన్యమైంది" అన్నాను.

"తప్పులన్నావుగా, అవేమిటో కాస్త వివరంగా చెప్పు" అన్నాడు రావుగారు.

మాట మార్చడానికి కాబోలు, "స్వోత్కర్ష అనుకున్నా సరే– నేనేనా అనిపించేటంత బాగుంది నా పాట. కారణం నాకు తెలుసు. అంతా మీ సిస్టం మహిమ. మా ఇంట్లో ఇలాంటి సిస్టం లేదు. మామూలు కాసెట్ రికార్డరుంది, అంతే!" అంటూ భర్తని నిష్ఠూరంగా చూసిందామె.

"మీ ఇంట్లో నిజంగా స్టీరియో రికార్డింగ్ సిస్టం లేదా? నిజానికిది మీవంటివారికే అవసరం" అని, "ఐనా అసలు గొంతు ప్రతిధ్వనించే మీ ఇంట్లో, రికార్డెడ్ గొంతుల అవసరం ఏముంటుందిలెండి!" అన్నాను.

"అబ్బే, అదేం కాదు. మేమిక్కడ ఎంతకాలం ఉంటామో తెలియదు. టెక్నాలజీ చూస్తే రోజురోజుకీ మారిపోతోంది. ఇండియాకి తిరిగి వెళ్లేముందు అప్పుడే మోడలొస్తే అది కొందామని వాయిదా వేస్తున్నాను. ఇండియన్ మెంటాలిటీ" అన్నాడు రావుగారు.

అది నిజమే. ఆ ఏడాది చివరకు వెళ్లిపోయేవాళ్లం. అందుబాటులో ఉన్నది కొనుక్కుంటాం. వాళ్లకి ఎదురుచూడ్డానికి అవకాశముంది.

ఆ మాట రావుగారికి చెప్పి, “రికార్డర్లో మీ పాట విన్నాక మీకు స్పష్టమయుండాలి– మీకు ప్రిపరేషన్ అవసరం లేదని! మాకోసం మరొక్క పాట” అన్నాను సత్యవతితో అభ్యర్థనగా.

నా మాటలే– శ్రీమతి, పాప చూపుల్లో పలికించారు

సత్యవతి ఎక్కువ సమయం తీసుకోలేదు. వెంటనే గొంతు సవరించుకుని, ‘హృదయతంత్రులు మీటి మృదుల జీవితవీణ పలికించి తీయగా పాడవే ఓ సఖీ’ అని పల్లవి అందుకున్నారు.

అది సినిమా పాట కాదు. లలిత గీతం.

కంచు కంఠానికి మృదుత్వాన్ని జోడించి, భావాన్ని రసాత్మకంగా సంగీతంతో రంగరించిన బాణీలో– చెవుల్లో అమృతం పోస్తున్నట్లున్న ఆ పాట కలిగిస్తున్న అనుభూతిని మాటల్లో చెప్పడానికి భోజుని నవరత్నాలో, రాయలవారి అష్టదిగ్గజాలో దిగి రావాలి.

ఆమె చరణాలలోకి వెళ్లింది.

‘జీవిత వసంతమ్ము చిగురించుచున్నదే
వలపులే పూలౌచు పరిమళించుచునుండె
మనసనే కోయిలా మధురరాగము తీయ
ప్రేమగీతికలౌచు వినిపించునే సఖీ...... హృదయతంత్రులు మీటి....
గాలివానలు ముసిరి పొంగినా
ఆకాశమే విరిగి అవనిపై కూలినా
లోకాలు ఏకమై రూపు చెడినా కాని
ఎడద కలిగిన ప్రేమ విడిపోవదే సఖీ...... హృదయతంత్రులు మీటి....
ఏనాటి బంధమో ఈనాటి మన ప్రేమ
ఎన్ని జన్మలకైన నీవు నేనొకటేలె
రాధికా మాధవుల ప్రణయరాగమువోలె
మన ప్రేమ భువిలోన మధురకావ్యంబౌనె...... హృదయతంత్రులు మీటి....

పాట ముగిసేసరికి ఏదో గంధర్వలోకంనుంచి దిగివచ్చినట్లుంది.

“ఆలిండియా రేడియోలో గ్రేడెడ్ ఆర్టిస్టు అంటే ఏమో అనుకున్నాను. అందుకు ఇంతటి ప్రతిభ ఉండాలా?” అన్నాను అప్రయత్నంగా.

“ఆలిండియా రేడియో ఓ సంగీత సామ్రాజ్యం. అక్కడి కొలువులో కళాకారులముందు నేనేపాటి?” అంది సత్యవతి వినయంగా.

చిన్నప్పట్నించీ అందుబాటులో ఉన్న రేడియోలో లలిత గీతాల్ని విననందుకు ఏం కోల్పోయానో అనిపించింది.

అంతలో రావుగారు టైం చూసుకుని, “చాలా టైమయింది. ఒకసారి ప్లే చెయ్యండి. విని వెళ్లిపోతాం” అన్నాడు.

ఆయనన్నది నిజమే! అప్పటికి టైం పది కావస్తోంది, “రికార్డెడ్ పాట మరోసారి వినిపిస్తాను. అది వినే సమయాన్ని, మరో కొత్త పాటకి కేటాయిద్దాం” అని, సత్యవతివైపు తిరిగి, “సినిమా పాట తెప్ప మరేదైనా సరే– మీకిష్టమైనదైతే చాలు” అన్నాను.

ఆమె సరేనని, “టైమెంతో లేదు కాబట్టి బాలమురళీకృష్ణ థిల్లానాతో నేటి కార్యక్రమం ముగిస్తాను” అంది.

రావుగారు నవ్వి, “అంటే మొత్తంమీద నీ సంగీత ప్రదర్శనని కచేరీగా మార్చేశావ్” అన్నాడు.

పేరు విన్నానేమో కానీ థిల్లానా గురించి నాకేం తెలియదు. రావుగారు చెప్పిందాన్నిబట్టి– సంగీత కచేరీల్లో అది చివరి అంశం అని అర్థమైంది.

శాస్త్రీయ సంగీతమంటే– అన్న మాటనే మళ్లీ మళీ సాగదీసే ఓ ప్రక్రియ అనుకునే నాకు, ఈ కార్యక్రమం శాస్త్రీయంగా ముగియడం నచ్చలేదు. కానీ మొహమాటానికి మౌనం వహించాను.

సత్యవతి గొంతు సవరించుకుని, “ధీంతరనన ధీం” అంటూ మొదలెట్టింది.

ఆ గొంతు, గొంతులో వణుకులు, వరసలో లయ, లయానుగుణమైన పదాలు, పలుకులో వేగం...

రెండు నిముషాలు రెండు క్షణాల్లా అనిపించాయి.

హౌరాబ్రిడ్జిలో ‘మేరా నామ్ చింగ్‌చింగ్‌చూ’ అన్న లయ ప్రధానమైన పాట నాకెంతో ఇష్టం. ఐతే మాటకు దీటొచ్చే ఆర్కెస్ట్రా కలవకపోతే– ఆ పాట చప్పబడిపోతుంది.

సత్యవతి పాడిన ఈ థిల్లానా– ఏ వాయిద్య సహకారమూ లేకుండానే అంతకంటే గొప్ప అనుభూతినిచ్చింది.

“మహాకవి ఐన మా తాతగారు అనేవారు– ‘మెచ్చుకుందుకూ అర్హత ఉండాలని’. మీ పాట మమ్మల్ని ఒక అద్భుత ప్రపంచానికి తీసుకు పోయిందనడం మినహా ఇంకేం చెప్పలేను” అన్నాను.

తర్వాత తెలుగు సంప్రదాయం ప్రకారం వాళ్లకి వీడ్కోలు చెప్పాం. వెళ్లిపోతూ రావుగారు, “మన సమావేశం ఈసారి మాఇంట్లో” అన్నాడు.

ఆ పిలుపు నాకప్పుడు వరంలా అనిపించింది. ఐతే ఊహకందని మరో ఆశ్చర్యకరమైన విశేషం మాకోసం ఎదురుచూస్తోందని అప్పుడు నాకు తెలియదు.

***(కొనసాగింపు వచ్చేనెలలో)***

Post your comments